ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

# కల - నిజమయింది

"వచ్చింది, వచ్చింది. చిరకాల వాంఛితం సిద్ధించింది" అంటూ రామ్మూర్తి పటాక్షేపంగా నా చదువుల గదిలో ప్రవేశించాడు.

ఉలికిపడి చూశాను. గాంధీ టోపీ, వెయిస్ట్ కోటూ, ఖద్దరు సంచీ - ఎదుట పేము కుర్చీలో కూర్చున్నారు.

"భాయీ, ఇప్పుడు రావడమేమిటి? మాకు ఏనాడో వచ్చింది. మా హృదయాలు ఏనాడో చూచాయి, భావాన్ని ఏనాటి నుంచో అనుభవిస్తున్నాము. ఇప్పుడు వచ్చినవి జండాలూ, తగాదాలూను" అన్నాను కొంటెగా.

అతనికి చిరాకెత్తుకు వచ్చింది.

"ఔను - కథల్లో, కలల్లో తేలిపోయే మీకు రానిదేమిటి? లోకజ్ఞానం తప్ప- అట్టే నాన్చక నడు హైదరాబాదు. విశాలాంధ్ర రాజధానీనగరంలో మహోత్సవం కళ్ళారా చూద్దువు గాని-" అన్నాడు.

నాకు నవ్వొచ్చింది. సత్యాగ్రహిలో సత్యం పోయినా ఆగ్రహం మిగిలింది.

"భేషయిన మాట - సరిగ్గా లోకజ్ఞానం అంతమయిన చోటే మహాకవి పుడతాడు. లోకధూళికి దూరంగా ఉండడమే కవికి తపఃఫలమని నువ్వెరగవు. పద... శిలాఫలకంలా హుసేన్‌సాగరంలో పడి కావలసినన్ని అలలు రేగగొట్టు- నే నిక్కడ నా భావ నయనాలతో చూచి ఆనందిస్తాను" అన్నాను ఎగతాళిగా.

రామ్మూర్తి నవ్వుతూ అన్నాడు-

"ఉహూఁ- అయితే మా కన్న ముందే ఖత్తు కలిపేశావన్న మాట - వారితో- ఇంకా చెప్పవు?"

"మాకు కలపడమే గాని తీసివేయడం చేతగాదు. హృదయంతో వెడతాం హృద యాలు స్వాగతమిస్తాయి. మీరు హోరుతో వెడతారు. ఊరు విరగబడుతుంది. అంతే- "నా తెలంగాణ కోటిరత్నాల వీణ" అన్న మాట ఇప్పటికీ తియ్యగా నాకు జ్ఞాపకం

వస్తూంటుంది. ఆ మాట నేనే అన్నంత స్వత్వం దానిమీద నాకు. ఇదీ మా తత్వం - నువ్వీ ముక్క భర్జించుకోడానికి ఏళ్ళు పడుతుంది."

రామ్మూర్తి తేలిగ్గా చప్పరించేసి "లాభంలేదు, కవిత్వంలో పడిపోయావు, అసలు సంగతి వదిలేశావు" అన్నాడు విసుగ్గా.

"అదో పెద్ద కథ - ఈ ఉత్సవ సమయాన కమ్మని పూలవాసనలా జ్ఞాపకం వస్తోంది" చెప్పమంటావా?"

2

1951లోనో 52లోనో అనుకుంటాను. టెలిగ్రాం వచ్చింది. "తక్షణం బయలుదేర వలసింది. ఉపన్యాసం సికింద్రాబాదులో"- డి.కె."

ముగ్ధుణ్ణయాను. ఆలోచించని అనుకోని వార్త, తియ్యగా గుండెల్లో సలిపింది. అక్కడ కొత్తగా వికసించే సాహిత్యోద్యమాలు- మధురంగా మౌలికంగా చురుగ్గా వినవచ్చే యువ కంఠాలు- ఎన్నడూ చూడని నా వాళ్ళ యాస తెలుగు ప్రియాలాపాలు- వ్యక్తావ్యక్తంగా వినిపిస్తున్నాయి. సన్నిహిత బంధువుల యింట్లో పెండ్లికి పిలిచారు. అయితే యేం, ఇటు సాహిత్య బంధం ఎక్కువై పోయింది. పెండ్లికి రాలేనని రాసి, రైలుకు వెళ్ళాను. బండి వచ్చి స్టేషన్‌లో ఉంది.

తొందరగా హైదరాబాద్ కో టికెట్టు యిమ్మన్నాను.

ఆయన టికెట్టు తీసి నాంపల్లిలో దిగండి అన్నాడు. "కాదు, హైదరాబాదు" అన్నాను. ఆయన నవ్వి "నాంపల్లి తప్పదు" అని టికెట్టు ముందు పడవేశాడు.

'వాడీ'లో కూర్చున్నాను. తోచటంలేదు. ఎదటి బెంచి మీద మూలగా ఒక శ్రీమతి ఇద్దరు చిన్న పిల్లలతో కూర్చుంది. ఎవరు ఎక్కడకు వెడతారో తెలియదు గదా! నేను వెళ్ళి నంత దూరం సహయాత్రికులుగా వచ్చేవారెవరైనా దొరికితే ఎంత బాగుండునను కున్నాను, నవ్వొచ్చింది- కోరింది కోరినట్టూ జరిగితే ఇక మానవ జీవితం ఏమిటి? రైలెక్కిన ప్రతి నోరూ గుక్కతిరక్కుండా మాట్లాడుతూ ఉంటే ఈ మౌనవ్రతంతో ఎంత దూరయాత్ర భగవాన్! అనుకున్నాను. హఠాత్తుగా ఒక తల కిటికీలో దూరి నా వీపు మీదుగా అంది

"ఎంత వరకూ సార్"

"చాలా దూరం లెండి"

"రైలు ఆగిపోయిన చోట దిగుతారా?"

నవ్వి వెనక్కి తిరిగి అన్నాను. "మీరూ అక్కడికే అనుకుంటాను. చప్పున లోపలికి రండి. బండి కదులుతోంది"

"క్షమించండి. నేను కాదు, మా వదిన హైదరాబాదులో దిగుతుంది. పిల్లలతో ఒక్కర్తె వెళ్ళవలసి వచ్చింది. కాస్త మీరు..." అంటూండగా బండి నడిచింది. మాటాడిన వాడు

సరిగ్గా నా వయసువాడు. ఎదుటి బల్లవైపు చూశాను. నాకూ ఆమె వదినలాగే కనపడ్డది. రామాయణం బతికినంతవరకూ వదిన అనే మధురమూర్తి పూజాపీఠం మీద పువ్వులతో కనబడుతుంది గదా.

బల్ల మీద హ్రీమతి తల ఎత్తకుండా ఏదో ఆలోచిస్తోంది, ఎవరో ఇచ్చిన చనువుతో మెల్లగా అన్నాను. "హైదరాబాదు వెళతారా?"

తల ఎత్తింది. అచ్చంగా పంచవటిలో సీత: కొంచెం బెంగగా– కొంత ఉల్లాసంగా ఉంది ముఖం. విశాలాంధ్ర లాంటి చక్కని కళ్లెత్తి నెమ్మదిగా అంది. "ఔనండి ఖైదరా బాద్‌లో దిగాలి"

"అయితే హైద్రాబాదు వెళ్ళరన్నమాట" అన్నాను. సాయంకాలపు తెల్ల చంద్రకాంతపు పువ్వులా కొంచెం నవ్వి అంది.

"అయితే మీకు కొత్తన్న మాట!"–

ఏదో అజ్ఞానపు నీలి నీడ నాతో ఆటలాడుతున్నట్టనిపించింది. మనసును పట్టుకున్న మగతనపు అహంకారం కొంచెం కొంచెం విడుతున్నది.

"నేను హైద్రాబాదు" అన్నాను.

పెదవులు కదపకుండా కళ్లతో నవ్వింది. ఆ కళ్ళ వెలుగు ముందు కూర్చుని దురభిమానం లేకుండా ఎంతైనా నేర్చుకోవచ్చుననిపించింది.

3

సన్నని తెల్లవారుజాము చలిలో "వరంగల్లూ" అని వినిపించింది. ఆమె అట్లాగే కూర్చుంది నిశ్చలంగా వెలిగే దీపంలా. చర చర ప్లాట్‌ఫారం మీదకు నడిచాను. ప్రపంచం మారిపోయింది. నా లోకంలో నిద్రపోతే కొత్త లోకంలో మేలుకున్నట్లయింది. యాస తెలుగు. వింత కంఠాలు. జవాబుఅర్థంకాని ప్రశ్నించడం, పట్టి నిష్కామకర్మలా కన పడింది. పదార్థంతో సంబంధం లేకుండా సీసామీద అంటించిన లేబిల్‌లా యెదుటి బల్లచెక్క మీద తెలుపు మీద నలుపులో "వరంగల్లు" స్పష్టంగా కనబడుతోంది. ఓహో, ఒకనాడు విమత వాహినులకు ఎదురొడ్డి అవిచ్ఛిన్నంగా ఆంధ్రపతాక ఎగురవేసిన కాకతీయ ప్రభువు గడ్డమీద నిలుచున్నానా? అని తోచి ఒడలు గరి పొడిచింది. చుట్టూ చూశాను. పైకి చూశాను, శిథిల వప్ర శిఖరమో– జీర్ణ సౌధాగ్రమో కనిపిస్తుందని.

అంతా వట్టి చీకటి "దూరా దాకర్ణ్య విశ్వవిస్తృమరమహసో వీరరుద్రస్య జైత్ర ప్రస్థానారంభభేరీ" జ్ఞాపకం వచ్చింది. కీచురాళ్ల రొదలు తప్ప యేమీ వినిపించలేదు. "ఓరుగల్లున రాజవీర లాంఛనముగా పలు శస్త్రశాలలు నిలుపునాడు" చెవుల్లో మార్మోగు తోంది.

"శ్రీ కైవల్య పదంబు జేరుటకునై చింతించెదన్" అంటూ తెలుగుల పుణ్యపేటి పోతన్న గారు జ్ఞాపకం వచ్చారు. "పిచ్చివాడా, త్రోవ తెలియని భూతకాలపు చీకట్లలోకి నడిచి

ఏం లాభం" అన్నట్టు రైలు కూసింది. చట్టున ఒక కానీ వేప పుల్లను కొనుక్కొని రైలెక్కాను. గుప్పిట్లోని కానులు నాలుగు చూసి తెల్లబోయాను. అణాకి ఎన్ని కానులని! సీతాదేవి కనిపెట్టింది. "మిమ్ముల్ని చూడగానే వాడికి తెలిసి పోయింది. కనుకనే పైస తక్కువి చ్చాడు" అంది అవలీలగా. లెక్క తెలిసినందుకు సంతోషించాను. సికిందరాబాదులో తన్ను స్వీకరింపవచ్చిన రామచంద్రుడి చేత మా సీతాదేవి ఇడ్డెన్లు తెప్పించి తినమని బల వంతం చేసింది. సౌమిత్రి ఆ కళ్ళ చురుకుకు భయపడి తినివేశాడు. కృతజ్ఞతా పూర్వ కంగా చిరునవ్వు నవ్వి, జానకీదేవి ఖైరతాబాద్‌లో దిగిపోయింది.

4

నాంపల్లిలో దిగాను. హైదరాబాదు వెతుక్కుంటూ- అంతా అక్కడే దిగితే బుకింగు క్లార్కు నవ్వు ముఖం జ్ఞాపకం వచ్చింది. స్టేషనుకి ఎవ్వరూ రాలేదు. వస్తే మాత్రం- పర మాదరం గల అతిథీ- ఆతిథేయులూ ఒకరినొకరు యెరగరు. కాని వేయి మందిలోనైనా గుర్తుపట్టగలమని హృదయాలకి దిలాసా కాబోలు-సాహిత్యవాసన యెంత విచిత్రమైనది!

స్టేషన్ వెలుపల నవ్వు ముఖంతో సాహితీ బంధువు వెంకట్రావుగారు ప్రత్యక్ష మయారు. వెనక యెర్రగా పొట్టిగా వదులు ఖద్దరు లాల్చీతో చురుకైన కళ్ళు గల ఒక యువకుడు నిలుచుని తీర్చిదిద్దిన గీత పద్యంలా కనబడ్డాడు. అమృత కలశం తొణికినట్లు ఆ యువకుడు నన్ను చూసి నవ్వాడు. అతడే దాశరథి అయితీరాలని కళ్ళతో అన్నాను. అంతే అన్నారు వెంకట్రావు గారు. రిక్షా ఊళ్ళోకి వెళ్ళడానికి బదులు ఒక ఆఫీసు ముందు ఆగింది. "కష్టమ్ము" ప్రారంభం అన్నారు వెంకట్రావు గారు. "కష్టీ ఫలీ" అని నవ్వు కున్నాము.

5

సాయంకాలం సికింద్రాబాద్‌లో సాహిత్యగోష్ఠి. రామానుజరావు అధ్యక్షత వహిం చారు. దాశరథి, నారాయణరెడ్డి వగైరా ఉదీయమానులంతా సభలో నిండిపోయారు.

రామానుజరావు గారు పుస్తకంలా మాటాడారు. ఒక్క పొల్లు మాట లేదు. నన్ను గురించి నాకన్న యీయనకే యెక్కువ తెలుసునేమో అనిపించింది. మన మీదా, మన సాహితీ గమనం మీదా యింత శ్రద్ధాసక్తులు గలవారా? అనిపించింది. తన్మయత్వంలో యేమి మాట్లాడానో చెప్పలేను. ప్రసంగం ముగిసింది. పద్యాలు చదివాను.

సరిగ్గా గుణలేశం ఉన్న చోట ఊగిన దాశరథి, నారాయణరెడ్డి తలలు యిప్పటికీ నాకు జ్ఞాపకమే. ఇంతటి ఆత్మీయుల్ని సాహిత్య స్నిగ్ధుల్ని చూడకుండా ఇన్నాళ్లు యెట్లా మనగలిగాము అని ఆశ్చర్యపడ్డాను. రోడ్డు పేవ్‌మెంట్లమీద జనం నిలబడి విన్నారని యెవరో కిందకు వెళ్ళినవారన్నారు. అయితే మాట్లాడిన వాడు మొనగాడు కాదు. తన వాడిని యెట్లా చూడాలో తెలంగాణాకు తెలుసును అని-

మర్నాడు హైదరాబాదు కృష్ణదేవరాయ భాషా నిలయంలో ప్రసంగ విషయం కాళి

దాసు. అధ్యక్షుడు దాశరథి. వెంకటావధాని గారిని చూడగానే హృదయం పొంగింది. ప్రసంగం ఉత్సాహంతో సాగింది. చివరి ప్రసంగంలో - దాశరథి మెరపులు. ఆతని సంప్రదాయ ప్రవణతకు మనస్సు నిండిపోయింది.

ఆర్ద్ర నయనాలతో మిత్రులందరి దగ్గరా సెలవు తీసికొని బయలుదేరాం. కారులో వెడుతూ అనుకున్నాం. తెలంగాణా అంటే యింత ఆత్మీయ మైనదా? ఈ యువ సాహితీ వ్రతులతో యెడబాటు లేని జీవితం లభించడం యెంత ప్రియమైనది! అంతా కలిసి నిత్య సాహిత్యారాధన చేస్తూ ఒక్క గడ్డలో బతికే సుముహూర్తం యెన్నటికైనా రాదా!

వనపర్తి స్టేషన్ దగ్గర బస్సు ఆగింది. చూస్తే హోల్డాలు లేదు. పుస్తకాలు, నోట్సు, రచనలు, బ్రతుకంతా అందులో ఉంది. మతి పోయింది. తెల్లబోయి నిలుచున్నాను. కండక్టరు వెంటనే బస్సు ఎక్కమన్నాడు: అర్థం కాలేదు. మీ "బిస్తరు" పోదు. రమ్మన్నాడు. వెళ్ళాను. వనపర్తి షెడ్‌లో దొరికింది. హోల్డాలంతా విప్పివేశారు. చిరాకు పడ్డాను.

అధికారి 'ఇది ఒక బొమ్మన్‌ది' అంటున్నాడు. నేను నవ్వాను. నీవు బొమ్మన్‌వా అన్నాడు. అందులోని పట్టుబట్ట చూపిస్తూ. ఆ ఒక్క గుర్తుతో ఇచ్చివేశారు. నాకన్న ఆ కండక్టరుదే సంతోషం. ఆదరంగా తాను తెచ్చి బస్సులో వేశాడు. టీ తాగమన్నాను. వద్దన్నాడు. 'అమృతమస్తు' అనడానికి ఆ చుట్టుపల్ల ఏమీ లేవు. ఒక చవకరకం కాఫీ హోటలుంది దూరంగా - వెళ్ళాను. టేబిల్ దగ్గర ఒక మనిషి కూర్చున్నాడు. "టీ ఉందా" అన్నాను. "ఉండదయ్యా" అన్నాను. "పోనీ కాఫీ ఉందా" అన్నాను. అదే స్థాయిలో "ఉండ దయ్యా" అన్నాడు. ఒళ్ళు మండిపోయింది. క్షుద్బాధ ఎక్కువగా ఉంది. "ఏమీ లేకపోతే ఏడవడానికా ఇది" అన్నాను గోదావరి యాసతో. అతను పక పక నవ్వి లేచాడు. ఆ నవ్వు మరీ కోపాన్ని రెచ్చగొట్టేలా ఉంది. మాటాడకుండా అతడు లోపలికి నడిచి కాఫీ తెచ్చి టేబుల్ మీద పెట్టాడు. "మరి లేదన్నావేం?" అన్నాను అందుకుంటూ. "ఉండ దయ్యా" అని మరింత గట్టిగా నవ్వేడు. కాఫీ తాగి బయటికి నడుస్తున్నాను కొంటెగా. వాడు తెల్లబోయి పైసా అని వేళ్ళతో అభినయించాడు. నేను బేడ కాసు తీసి బల్లమీద పెడుతూ "ఉండదయ్యా" అన్నాను నవ్వుతూ.

ఆహా, ఇతడు తెలుగువాడు. నేను తెలుగువాణ్ణి. ఎంత బెదురుగా చూసుకున్నాం ఒకరికొకరర్థంకాక. ఎన్నడైనా ఇతడూ నేనూ, ఒక్క భాష మాట్లాడి ఒక్క మహానగరం తాలూకు పౌరులం కాగలమా?

ప్రతాపగిర్జీ కోఠీలో బ్రహ్మాండమైన షామియానా కింద తెలంగాణా రచయితల మహాసభ ప్రారంభమయింది. ఏమి ఉత్సాహ వాహిని! ఏమి జన సమ్మర్దం - తీరాంధ్రంలో ముమ్మరమయిన నవసాహిత్యోద్యమం వెనక పట్టిన తర్వాత, అంతటి మహాసభ చూడ లేదు. వేదికమీద నలభై మంది రచయితలు. వారి ఉత్సవంలో ఉద్యమంలో పాలు పంచుకోడానికి తీరాంధ్రం నుంచి నేనూ, చెన్నపట్నం నుంచి శ్రీశ్రీ, ఆరుద్రా, రాయలసీమ

నుంచి పుట్టపర్తివారూ వెళ్ళాం. యెదుట వెన్నెల పొర వంటి మస్నద్‌ల మీద ప్రముఖ మంత్రితో కూడా ఒకరిద్దరు మంత్రులు, వేలకొలదీ కాలేజీ విద్యార్థులు, పుర ప్రముఖులు, ఇతర ప్రేక్షకులూ కెరటాల్లా ఉప్పొంగుతున్నారు.

ఒక మరాఠీ అయనా, కన్నడ ప్రముఖుడూ, తమ సాహిత్యాలతో తెలుగును పోలుస్తూ ఉత్తేజకరంగా మాట్లాడారు. వాతావరణం అంతా సారస్వత సువాసనతో మత్తెక్కినట్టుంది.

సాహిత్యగోష్ఠిని నేను ప్రారంభించాను. సర్వాంధ్రమూ అనురాగ బంధంతో ఆకర్షింపబడి ఒక్క వేదికమీద కిటకిటలాడుతూ కూర్చున్నట్టు తోచింది. ఓహో, మాకిప్పుడే విశాలాంధ్ర సిద్ధించింది! చాళుక్యసీమ, నెల్లూరుసీమ, రాయలసీమ, కాకతీయ సీమలతో కలిసి ఒక్క కంఠంతో ఇక్కడ మాటాడుతున్నది. పరస్పరా శ్లేషాలతో ఉద్దీప్తమౌతున్నది. ఇదే సాహిత్య విశాలాంధ్ర. నేడే ప్రారంభ పూజోత్సవం. ఈ అఖండమైన షామియానాలో మళ్ళా ఇంకోసారి సమావేశం జరపవలసి ఉంటే అది లాంఛన ప్రాయంగా రాజముద్ర పడ్డ మహేంద్రలో. అది ఎంత దూరమో తెలియదు. కాని సుదూరం కాదని ఈ హృదయాల్లో గట్టిగా స్పందిస్తున్నది! అనేసరికి మంత్రుల ముఖంలో దరహాస రేఖలు దృశ్యాదృశ్యమైన రాజముద్రల్లా మెరిశాయి.

• • •

మైసూరు కేఫ్‌లో విశ్రమిస్తున్నాం రాత్రి. చట్టున అదే షామియానా కళ్ళకు మిరుమిట్లు గొల్పుతూ విప్పుకున్నది. సూర్యకాంతులతో నేసినట్టు ధగ ధగ వెలిగే పట్టు తివాసీ మీద తేజస్సీమ నుంచి సరాసరి వేంచేసినట్టు కొందరు మహామహులు ఆసీనులై ఉన్నారు.

జరీ పట్టు దిండ్ల నానుకుని ఒక రాజ చిహ్న చిహ్నితుడూ, ఒక బ్రహ్మవర్చస్వీ జంట జంటగా కూర్చున్నారు. ఎంతటి రాజకీయ దురంధరులైనా కవిని దగ్గరగా కూర్చోబెట్టుకోడానికి వారు సంకోచించరులా ఉంది. ఇంతకూ వారెవరు?

రాజును బట్టి కవినా? కవిని బట్టి రాజునా గుర్తుపట్టడం? కవిని బట్టే రాజు నిలిచాడు అనుకొని వెదకడం ప్రారంభించాను.

మొదటి జంటలోని వర్చస్వి పెదవులు కదుపుతూ ఉంటే "విశ్వశ్రేయః కావ్యం" అన్నట్టు పసి కట్టాను. ఇంకేం నన్నయగారు దొరికారు. అయితే పక్కనున్న వారు "చాళుక్య మన్మథుడు కాక ఇంకెవరు?"

రెండవ జంటలోని కుండలి, "ఆంధ్రావళి మోదముం బొరయ" అన్నట్టు విన్పించిందని శ్రీశ్రీ అన్నాడు; తిక్కయజ్వనూ పక్కనున్న మనుమసిద్ధిని కనుక్కున్న గౌరవం అతనికి దక్కింది. తరువాత ఎవరు ఎవర్ని పోలిక పట్టారో సరిగా చెప్పలేను గాని, తక్కిన వార్ని కూడ తేల్చివేశాం. మూడవ జంటలో కాకతిప్రభువూ, విద్యానాథుడు, తరువాత రాయల వారూ పెద్దన్న, అనంతరం బక్క చిక్కిన దేహంతో శ్రీతాళసంపుటంతో అర్ధనిమీలిత నేత్రాలతో ఒక్కడూ కూర్చుని ఒకాయన తనలో "ఇమ్మనుజేశ్వరాధముల" అంటున్నట్టు

తోచింది. ఆయన నిర్లక్ష్యం చూస్తే, తుదిని సన్నని సోగ శరీరంతో నిశితమైన చూపులతో "భగవతి, గోదావరి నమస్తే" అన్నట్టు వినపడి అటు నిదానించాం. ఓహో, పంక్తిపావనుడు శ్రీకంఠ లాంఛనుడు భవభూతి, అతిథిగా యశోవర్మను వెంటబెట్టుకుని ఎంతదూరం నుంచి వచ్చాడు! బాంధవ్యం అంటే అలా ఉండాలి. ఔను "యత్రద్రుమా అపి మృగా అపి బాంధవో మే" అన్న బేలవాడు.

క్షణంలో మేమూ వేదికమీద ఉన్నాం. సాలప్రాంశువు కాళోజీ... ఓరుగల్లు అభిమాన మేనా లేకుండా విద్యానాధుణ్ణి దాటి తిక్కన గారి దగ్గరగా జరిగాడు. శ్రీశ్రీ, ఆరుద్రా అక్కడే పెనుగులాడుతూ కూర్చున్నారు. దాశరథీ, అతని తమ్ముడూ, నన్నయ తిక్కనల మధ్య ఉపవిష్టులయారు. నేనూ, పుట్టపర్తీ భవభూతి, విద్యానాధులకు నమస్కరించి ఒకరు నన్నయ పాదతలం వద్దా, ఇంకొకరు సోమయాజుల చరణ పీఠం దగ్గరా, చతికిలపడ్డాము.

ఒక మెరపు మెరిసింది. వేదిక మీద ప్రముఖాంధ్ర రాజతేజమూ, కవి వర్చసమూ చిరునవ్వు పువ్వులతో రెండు చేతులూ ఎత్తి, అఖండాంధ్రాన్ని ఆశీర్వదిస్తున్నారు" ఉలికిపడి లేచాను.

"ఆ కల నిజమయింది" అన్నాను రామ్మూర్తితో తృప్తిగా.

**(1956 నవంబరు 4 - ఆంధ్రప్రభ దినపత్రిక)**

కథా నిలయం
6070
శ్రీకాకుళం